క్లుప్తంగా

కరెంటు ఉండని ప్రాంతాలు

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ 11 కేవీ బాలసరస్వతీనగర్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మరమ్మతులు జరుగుతాయని ఏడీఈ యాదగిరి తెలిపారు. ఈ సందర్భంగా ఆనంద్‌బాగ్, తాళ్లబస్తీ, విమలాదేవినగర్, విష్ణుపురికాలనీ, శివపురికాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

స్పోర్ట్స్ మీట్‌లో కార్పొరేటర్ల సందడి



ఉప్పల్ ఇండోర్ స్టేడియంలో డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి, కార్పొరేటర్లు

ఉప్పల్: నిత్యం ప్రజా సమస్యల పరిష్కారంలో బిజీగా గడిపే జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు శుక్రవారం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌లో సందడి చేశారు. చెస్, క్యారంబోర్డు, షటిల్, బ్యాడ్మింటన్ తదితర పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, బన్నాల గీత ప్రవీణ్‌తో పాటు మహిళా ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

టెన్నికాయిట్‌లో విజేతగా బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా కార్పొరేటర్లకు నిర్వహించిన క్రీడా పోటీల్లో చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పాల్గొన్నారు. శుక్రవారం జరిగిన టెన్నికాయిట్ పోటీల్లో కార్పొరేటర్లు దేదీప్య, బన్నాల గీతపై విజయం సాధించి ఫైనల్‌లోకి ప్రవేశించింది. ఫైనల్‌లో కార్పొరేటర్ సుజాతపై గెలుపొంది విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడాపోటీలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. అనంతరం బ్యాడ్మింటన్, క్యారమ్ పోటీల్లోనూ ఆమె పాల్గొన్నారు.

'పాలనపై ప్రభుత్వానికి శ్రద్ధ లేదు'


మాట్లాడుతున్న ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

మల్లాపూర్: ప్రభుత్వానికి పాలనపై ఏమాత్రం శ్రద్ధలేదని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. మల్లాపూర్‌లో భారత రాష్ట్రపతి ప్రసంగం శక్తి కేంద్ర సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ విషయంలో ప్రభుత్వానికి ఎటువంటి పశ్చాత్తాపం లేదని, రైతులపై చిత్తశుద్ధి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. సమావేశంలో జనగాం జిల్లా ఇన్‌చార్జి పాపారావు, మల్కాజిగిరి పార్లమెంట్ కన్వీనర్ శ్రీనివాస్, ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ బాలచందర్, ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి రవినాయక్, జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు రాగిరి మోహన్‌రెడ్డి, రవీంద్రర్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్యాకేజింగ్ కోర్సులకు ఉజ్వల భవిష్యత్

రామంతాపూర్: ప్యాకేజింగ్ కోర్సులను అభ్యసించే విద్యార్థులకు దేశవిదేశాల్లో అపారమైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, వారికి ఉజ్వల భవిష్యత్ ఉందని రాష్ట్ర ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ఏ.పుల్లయ్య అన్నారు. అంతర్జాతీయ ప్యాకేజింగ్ డే పురస్కరించుకొని రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్యాకేజింగ్ కోర్సుల విభాగం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ అరుదైన ప్యాకేజింగ్ కోర్సు డిప్లొమా స్థాయిలో రెండు తెలుగు రాష్ట్రాల్లో కేవలం రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోనే ఉండటం సంతోషకరమైన విషయమన్నారు. ప్యాకేజింగ్ విభాగాధిపతి వెంకటరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ వినయ్‌కుమార్, ప్యాకేజింగ్ టెక్నాలజీ పూర్వ విద్యార్థులు ప్రస్తుతం అరవింద్ లేబరేటరి డీజీఎం ప్రసాద్ శ్రీనివాస్, హతిరామ్ తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సాంకేతిక విద్యశాఖ జాయింట్ డైరెక్టర్, తదితరులు

సమ్మేళనాలతో విభేదాలు సమసిపోయేనా..!

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో బీఆర్ఎస్ బలోపేతమే లక్ష్యంగా సమ్మేళనాలు

- రానున్న ఎన్నికల నేపథ్యంలో అభివృద్ధి, సంక్షేమంపై ప్రజల్లో ప్రచారం
- నెల రోజుల కార్యాచరణ ఖరారు చేసిన పార్టీ నాయకులు
- జిల్లా సమన్వయ కర్తగా, ఎమ్మెల్సీ, రైతు బంధు సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- మంత్రి, ఎమ్మెల్యేలు, నాయకుల మధ్య నెలకొన్న అంతర్గత విభేదాలపై కేడర్‌లో చర్చ

సాక్షి, మేడ్చల్ జిల్లా: రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కార్యకర్తలందర్ని ఏకతాటిపైకి తెచ్చేందుకు ఆత్మీయ సమ్మేళనాలకు శ్రీకారం చుడుతోంది. దాదాపు నెల రోజుల పాటు జరిగే సమ్మేళనాల్లో ప్రభుత్వ పథకాలపై ప్రచారం కల్పించడంతో పాటు పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసి కార్యకర్తల్లో ఉత్సాహం నింపాలని భావిస్తోంది. ఇందుకోసం పార్టీ శ్రేణులను సమన్వయ పరిచేందుకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజుతో కలిసి జిల్లాకు సమన్వయకర్తగా అధిష్టానం నియమించిన ఎమ్మెల్సీ, రైతు బంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి పార్టీ కార్యకర్తలను ప్రజల్లోకి పంపించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలను ప్రజలకు వివరించే కార్యక్రమంలో కార్యకర్తలందరిని భాగస్వాములను చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన పథకాల వివరాలను ప్రజలకు వివరించాలని అధిష్టానం ఆదేశించింది. ఇందు కోసం కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం పేరిట గ్రామాల్లో, పురపాలక సంఘాల్లో డివిజన్లు/వార్డుల్లో సమావేశాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు, సర్పంచి, ఎంపీటీసీ సభ్యులు, రైతుబంధు కన్వీనర్, సింగిల్ విండో చైర్మన్లతో పాటు జడ్పీటీసీ, ఎంపీపీ, మండల పార్టీ కార్యవర్గం, అనుబంధ సంఘాలు, కార్పొరేషన్ చైర్మన్లు అందరితో ఈ సమావేశం నిర్వహించనున్నారు. సంబంధిత నియోజకవర్గ ఇన్‌చార్జి ఉండే ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ, జడ్పీ చైర్మన్, డీసీసీబీ చైర్మన్, ఇతర పదవులున్న నేతలందరినీ ఆహ్వానిస్తారు. పురపాలక సంఘాల్లో కార్పొరేటర్/కౌన్సిలర్, పార్టీ వార్డు అధ్యక్షుడు ఇతర కార్యవర్గాన్ని భాగస్వామ్యం చేస్తారు. మేయర్లు, డిప్యూటీ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, వైస్‌చైర్మన్లు సమావేశాల్లో పాల్గొనేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు.



నెల రోజుల పాటు బీఆర్ఎస్ సమ్మేళనాలు

గ్రామ కార్యకర్తల సమ్మేళనం ఏ తేదీన నిర్వహిస్తారో నియోజకవర్గ ఎమ్మెల్యే నిర్ణయించాల్సి ఉంటుంది. వివరాలను పార్టీ జిల్లా ఇన్‌చార్జి లేదా సమన్వయకర్తకు అందజేస్తే అక్కడి నుంచి వచ్చిన ఆదేశాలకనుగుణంగా సమావేశాలు నిర్వహిస్తారు. ఈ నెల 24 నుంచి ఏప్రిల్ 24వ తేదీలోగా ఈ సమ్మేళనాలు పూర్తిచేయాలి. అనంతరం 25న గ్రామాల్లో, వార్డుల్లో పార్టీ జెండాలు ఎగురవేసి పండగ వాతావరణం తలపించేలా కార్యక్రమం చేపట్టాలని సూచనలు ఉన్నాయి. ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా సచివాలయం ఎదుట 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనుండటంతో జిల్లా వ్యాప్తంగా కార్యకర్తలు ఉత్సవాలు నిర్వహించనున్నారు. కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాల విజయవంతం కోసం పార్టీ జిల్లా సమన్వయ కర్త ఇక్కడకు చేరుకుని నేతలకు దిశా నిర్దేశం చేస్తారు. పార్టీ అనుబంధ విద్యార్థి విభాగం పటిష్టపరచడంపైనా దృష్టిపెడుతారు. సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో విద్యార్థులను ఇందులో చేర్పించనున్నారు. ప్రస్తుతం పరీక్షల కాలం కావడంతో జూన్ నెలలోనే విద్యార్థి విభాగాలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.

సమ్మేళనాలు ఇలా...

పది గ్రామాలను కలిపి ఒక సమ్మేళనం ఏర్పాటు చేస్తారు. పట్టణాల్లో 3 నుంచి 4 వార్డులను కలిపి ఓ సమ్మేళనం ఉంటుంది. గ్రామాల నుంచి వచ్చే కార్యకర్తలకు అక్కడ చేపట్టిన అభివృద్ధిని గణాంకాలతో సహా వివరిస్తారు. పథకాలతో లబ్ధిపొందిన వారి జాబితాను అందిస్తారు. ఆ వివరాలతో కార్యకర్తలు కలసికట్టుగా పర్యటిస్తూ.. ప్రభుత్వం గ్రామానికి ఏం చేసింది? ఎన్ని నిధులతో పనులు జరిగాయి? ఎందరు లబ్ధి పొందారో వివరించి ప్రజలను ఆకట్టుకునేలా చేయడం ముఖ్య ఉద్దేశంగా కనిపిస్తోంది.

విభేదాలు సమసి.. సమన్వయం జరిగేనా..!

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో బీఆర్ఎస్ నేతల మధ్య అంతర్గంగా కొనసాగుతున్న విభేదాలు.. త్వర లో జరిగే విస్తృత సమ్మేళనాలతో సమసి పోగలవా .. లేక మరింత ముదురుతాయన్న చర్చ పార్టీ వర్గాలను వేధిస్తోంది. మంత్రి మల్లారెడ్డిపై జిల్లాకు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేయగా, ఇంత వరకు ఇది ఓ కొలిక్కివచ్చిన దాఖలాలు కనిపించడం లేదు. కొద్ది రోజుల కిందట మల్కాజిగిరి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత హన్మంతరావు ఇంట్లో సమావేశమైన జిల్లా పార్టీకి చెందిన 5 ఎమ్మెల్యేలు తమ నియోజక వర్గాల్లో అభివృద్ధి నిధుల విషయంలో మంత్రి మల్లారెడ్డి జోక్యాన్ని తప్పుపట్టారు. ఈ వ్యవహారాన్ని లిపై సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తామని, 5 ఎమ్మెల్యేలు ఆ సందర్భంగా ప్రకటించారు. అలాగే, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఆదేశాలను ఖాతర్ చేయకుండా నామినేటెడ్ పదవులను మంత్రి మల్లారెడ్డి సొంత నియోజకవర్గం వారికి కట్టబెట్టారని ఎమ్మెల్యేలు ఆరోపించారు. ఈ వ్యవహారం ఇంకా చక్కబడకపోవడంతో విభేదాలు కొనసాగుతూనే.. ఉన్నాయి. అలాగే మేడ్చల్‌లో మంత్రి మల్లారెడ్డి వర్సెస్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఉప్పల్‌లో ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, మాజీ మేయరు బొంతు రామ్మోహన్, కుత్బుల్లాపూర్‌లో ఎమ్మెల్యే వివేకానందగౌడ్, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు మధ్య విభేదాలు తారస్థాయిలో ఉన్నట్లు కేడర్‌లో చర్చ సాగుతోంది. కూకట్‌పల్లిలో కూడా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇద్దరు తమ వర్గాలను ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలోని 13 పురపాలక సంఘాలోలే అధికార పార్టీ మేయర్లు, డిప్యూటీ మేయర్లు, చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఉన్నప్పటికీ వారి మధ్యనే ఉన్న విభేదాలు వచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా కొనసాగుతున్నాయి. జీహెచ్ఎంసీ పరిధిలోని డివిజన్లతో సహా పలు గ్రామాల్లో కూడా పార్టీ ప్రజా ప్రతినిధుల మధ్య అంతర్గత విభేదాలు చాపకింద నీరులా కొనసాగుతున్నాయి. అయితే.. పార్టీ విస్తృత సమ్మేళనాలతో బీఆర్ఎస్ నేతల మధ్య నెలకొని ఉన్న విభేదాలు సమసిపోతాయా.. లేక భగ్గుమంటాయా.. అన్న ఆందోళన కేడర్ నుంచి వ్యక్తమవుతుండగా, దీన్ని జిల్లా సమన్వయకర్త, పార్టీ యంత్రాంగం ఎలా ఎదుర్కొని చల్ల బర్చగలదో వేచి చాడాల్సిందే మరి.

అర్హులు సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోండి


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

కుషాయిగూడ: అర్హులు సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. చర్లపల్లి డివిజన్‌కు చెందిన సహాయనిధి లబ్ధిదారులు వెంకట నారాయణకు రూ.50 వేలు, బుచ్చిరెడ్డికి రూ.31,500, స్వప్నకు రూ.22 వేల చెక్కును శుక్రవారం వాళ్ల ఇళ్లకు వెళ్లి అందజేశారు. కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు భాస్కర్‌రెడ్డి, గిరిబాబు, అనిల్ ముదిరాజ్, గంప కృష్ణ, వినోద్, మల్లారెడ్డి, రెడ్డినాయక్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కిరణ్‌కుమార్‌కు రూ.52 వేల చెక్కు

హబ్సిగూడ: ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన కిరణ్‌కుమార్‌కు రూ.52 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి శుక్రవారం హబ్సిగూడలో అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు సుగుడు మహేందర్‌రెడ్డి, మేకల ముత్యంరెడ్డి, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలి


కంటి అద్దాలు అందజేస్తున్న మేయర్ సామల బుచ్చిరెడ్డి

బోడుప్పల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవితం కోసం కంటి పరీక్షలు చేయించుకోవాలని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 21వ డివిజన్ పరిధిలోని బాలాజీ హిల్స్ ఫేస్–3 కాలనీలోని చిల్డ్రన్స్ పార్కులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం టీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ భూక్యా సుమన్‌నాయక్, కో ఆప్షన్‌సభ్యులు ఏజీ ప్రభాకర్, ఆర్‌ఐ కోట వెంకటేశ్వర్లు, కాలనీ ప్రతినిధులు నాగరాజు, ధర్మానాయక్, సునీల్‌రెడ్డి, బాలాజీ, అస్లాం, పీవీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత ఉత్సవ్‌ను విజయవంతం చేయాలి



మేడిపల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8 నుంచి 30 వరకు స్వచ్ఛత ఉత్సవ్ 2023 పేరిట కార్యక్రమాలు, మహిళలకు పోటీలు నిర్వహించాలని రాష్ట్ర పురపాలిక శాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, కమిషనర్ రామకృష్ణారావు ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 29న ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ జీరో వేస్ట్ అంతర్జాతీయ దినంగా ప్రకటించిందని ఇందులో భాగంగానే భారీ ర్యాలీ చేపట్టాలని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ నిర్ణయించింది. అనంతరం ప్రకటన పోస్టర్లను ఆవిష్కరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ జానకి, ఇంజినీర్ మురళి, స్వయం సహాయక సభ్యులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన వాణిరెడ్డి


కమిషనర్‌కు మొక్కను అందజేస్తున్న మేయర్ బుచ్చిరెడ్డి

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్‌గా నాగారం కమిషనర్ వాణిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన పద్మజారాణి తన మాతృ సంస్థ డీఆర్‌డీఏకి వెళ్లింది. కాగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన వాణిరెడ్డికి మేయర్ సామల బుచ్చిరెడ్డి, కార్పొరేటర్లు కొత్త చందర్‌గౌడ్, సింగిరెడ్డి పద్మారెడ్డి, సీసా వెంకటేశ్‌గౌడ్, సుమన్ నాయక్, బీఆర్ఎస్ నాయకులు బందారం శ్రీధర్‌గౌడ్, గుర్రాల వెంకటేశ్‌యాదవ్ కలిసి మొక్కను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ బుచ్చిరెడ్డి మాట్లాడుతూ కొంత కాలంగా అభివృద్ధి పనుల విషయంలో చాలా జాప్యం జరిగిందని, ఇక నుంచైనా త్వరగా పనులు జరిగేలా చూడాలని కమిషనర్‌ను కోరారు.

'లీకేజీ'పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి


మాట్లాడుతున్న బొజ్జ యాదగిరి

మల్లాపూర్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో సిట్‌తో కాకుండా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని దళిత జనసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొజ్జ యాదగిరి డిమాండ్ చేశారు. నాచారంలోని కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీలో సమర్థత లేనివారిని సభ్యులుగా నియమించారని ధ్వజమెత్తారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడటం సరికాదని స్పష్టం చేశారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వం తప్పిదం వల్లే సమస్యలు తెత్తుతున్నాయని మండిపడ్డాడు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంపత్, నాచారం డివిజన్ ఇన్‌చార్జి బాలయ్య, ముస్లిం మైనార్టీ ఇన్‌చార్జి సయ్యద్ మజీద్, దళిత జన స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షుడు బొజ్జ రాకేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హాథ్ సే హాథ్ యాత్రకు విశేష స్పందన


వెంకటాపురంలో పాదయాత్ర చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్

అల్వాల్: వెంకటాపురం డివిజన్ పరిధిలో రెండు రోజులుగా కొనసాగిన హాథ్ సే హాథ్ అభియాన్ యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని మేడ్చల్–మల్కాజిగిరి కాంగ్రెస్ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. శుక్రవారం వెంకటాపురం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన పాదయాత్ర చేసి సమస్యలు తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, పద్మ, ఆశారాణి, శివకుమార్, చంద్రశేఖర్, అశోక్‌రెడ్డి, సీఎల్.యాదగిరి, సాయికుమార్, శంకర్, పవన్‌కుమార్, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు ఏడేళ్ల జైలు


నిందితుడు సురేష్ (ఫైల్)

ఉప్పల్: భార్య ఆత్మహత్యకు కారణమైన కేసులో ఆమె భర్తకు న్యాయస్థానం ఏడేళ్ల జైలు శిక్ష విధించిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్నం ప్రాంతానికి చెందిన జయలక్ష్మి అలియాస్ నిత్యకు 2011లో వెడువాక సురేష్‌తో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో భారీగానే కట్నకానుకలు ముట్టజెప్పారు. ఆ తర్వాత కొన్నాళ్లకు సురేష్ అదనపు కట్నం కోసం భార్యను నిత్యం మానసికంగా, శారీరకంగా వేధించేవాడు. అతడి వేధింపులు భరించలేక జయలక్ష్మి 2014 జులై 13న ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. జయలక్ష్మి తండ్రి జగన్నాథం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఉప్పల్ పోలీసులు నిందితుడు సురేష్‌ను అరెస్టు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. వాదోపవాదాల అనంతరం మల్కాజిగిరి కోర్టు జడ్జి ఆర్. రఘునాథ్ రెడ్డి నిందితుడు సురేష్‌కు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తు శుక్రవారం తీర్పు చెప్పినట్లు పోలీసులు తెలిపారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం


ఆధార్ నమోదును పరిశీలిస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: మల్లాపూర్ సుభాష్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. చిరునామాలు, పుట్టిన తేదీ వివరాలు, వేలి ముద్రలు నమోదు చేసుకోవచ్చన్నారు. ఆధార్ కేంద్రాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆధార్ నిర్వాహకులు మహేష్, సౌజన్య, రాజేష్ పాల్గొన్నారు.

సకాలంలో జీతాలు చెల్లించాలి

అల్వాల్: పారిశుద్య కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వాసంశెట్టి శ్రీనివాస్ అన్నారు. బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అల్వాల్ సర్కిల్ ఏఎంసీ హేమలతకు వినతి పత్రం అందజేశారు. సకాలంలో జీతాలు అందక కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సుమారు 5, 6 నెలల నుంచి జీతాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. బీజేపీ నాయకులు లవకుమార్, మురళీకృష్ణ, ఉదయ్, సుదర్శన్, బందారు రవి, శివకుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జన చైతన్య యాత్ర పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

ఉప్పల్: సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జన చైతన్య యాత్ర ఈ నెల 28న ఉప్పల్‌కు చేరుకోనుంది. జనచైతన్య యాత్రను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం ఉప్పల్ సీపీఎం కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక కార్యక్రమాలను ఎండగడుతూ ఈ యాత్ర కొనసాగుతుందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఎం.వినోద, సర్కిల్ కార్యదర్శి ఎర్రం శ్రీనివాస్, జె.వెంకన్న, స్వామి, ఎండీ గౌస్, ఎస్.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకొని యువతి ఆత్మహత్య

అల్వాల్: ఉరివేసుకొని యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్‌కెహెచ్ కాలనీలో నివాసముండే గుంటి శాలిని(28) సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. గురువారం ఇంటర్వ్యూ ఉంది చదువుకోవాలని చెప్పి గదిలోకి వెళ్లింది. బయకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లి చూడగా ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్ఎఫ్‌సీ ఆర్వోబీ పనులపై అధికారుల సర్వే

పలు సూచనలు చేసిన మాజీ మేయర్ బొంతు రామ్మోహన్


అధికారులకు సూచనలు చేస్తున్న మాజీ మేయర్ బొంతు రామ్మోహన్

కుషాయిగూడ: మల్లాపూర్ ఎన్ఎఫ్‌సీ వద్ద ఆర్వోబీ పనులపై వివిధ శాఖల అధికారులు శుక్రవారం సర్వే నిర్వహించారు. రైల్వే వోవర్ బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణం కోసం రైల్వే, జలమండలి, హెచ్ఆర్‌డీసీఎల్ ఇప్పటికే కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా అధికారుల బృందం ఆర్వోబీని పరిశీలించేందుకు వచ్చింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న గ్రేటర్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ అధికారుల బృందాన్ని గమనించి వారితో చర్చించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా బ్రిడ్జి నిర్మాణం జరిగేలా చూడాలని సూచించారు. కూతవేటు దూరంలో చర్లపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి చెందుతున్న విషయంపై అధికారులతో చర్చించారు. అలాగే ఇంటర్ స్టేషన్ బస్ టెర్మినల్ ఏర్పాటయ్యే అవకాశం ఉందని, వీటిని దృష్టిలో ఉంచుకొని బ్రిడ్జి నిర్మాణం జరిగితే బాగుంటుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సమీపంలో ఉన్న తాగునీటి పైప్‌లైన్ క్రమబద్ధీకరించే సమయంలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. ఇప్పటికే బ్రిడ్జి నిర్మాణ టెండర్ల ప్రక్రియ పూర్తయ్యిందని, తాను మేయర్‌గా ఉన్న సమయంలోనే బ్రిడ్జి నిర్మాణంపై ప్రతిపాదనలు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రైల్వే చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ సుబ్రహ్మణ్యం, డిప్యూటీ సీఈ మనోహర్‌రెడ్డి, జలమండలి సీజీఎం విజయరావు, హెచ్ఆర్‌డీసీఎల్ ఎస్ఈ శ్రీనివాస్, ఈఈ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.